క్లుప్తంగా

గావ్‌షాత్ పూజలు

ఇంద్రవెల్లి: మండలంలోని పొల్లుగూడ గ్రామంలో మంగళవారం గావ్‌షాత్ పూజలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలో పొచ్చమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. గ్రామానికి ఎలాంటి కీడు రాకుండా ప్రజలను ఆయురారోగ్యాలతో ఉంచాలని, ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. గ్రామపెద్దలు జుగ్నాక్ మహదు, కోరెంగా లింగు, ఆత్రం శంకర్, జుగ్నాక్ కాశిరాం, సిడాం భుజంగ్‌రావ్, మర్సుకోల నాందేవ్, భారత్, జాలిం తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: షెడ్యూల్డు కులాల, తెగల జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలో సభ్యుల ఎంపిక కోసం జిల్లాలోని ఆమోదించిన ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జీవో)ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారిని సునీత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19లోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9440 628538పై సంప్రదించాలని సూచించారు.

రేపు ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా స్విమ్మింగ్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ జిత్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. బాల,బాలికలకు గ్రూప్-1 విభాగంలో అండర్- 15, 16,17 వారికి, గ్రూప్-2 విభాగంలో అండర్ -13,14 వారికి, గ్రూప్ -3 విభాగంలో అండర్ -11,12 వారికి ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఉదయం 8 నుంచి10 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు కోచ్ కొమ్ము కృష్ణను 9494945402 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని నేరడిగొండ పీహెచ్‌సీ హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. ర్యాపిడ్ ఫీవర్ సర్వేలో భాగంగా మంగళవారం మండలంలోని ఆరెపల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు డ్రైడేపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ భీంరాజ్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు రాథోడ్ అశ్విని, ఆశ కార్యకర్త సమికిబాయి, మాజీ సర్పంచ్ సిడం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలి

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నాయకులు పరమేశ్, సుధాకర్ యాదవ్, నర్సారెడ్డి, కిషన్, నర్సయ్య, ప్రమోద్, దేవన్న, రాజు తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీలో పూడిక తొలగింపు



డ్రెయినేజీలో పూడిక తీస్తున్న కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్..

సాత్నాల: భోరజ్ మండలం కోరట గ్రామంలో గల డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 'సాక్షి'లో 'డ్రెయినేజీ పూడిక తీయండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు మంగళవారం డ్రెయినేజీలో పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించారు.

సభ్యత్వ నమోదు

తలమడుగు: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కుమార్, ప్రధాన కార్యదర్శి స్వామి ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ తలమడుగు పాఠశాలలో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీడీవోకు సన్మానం

నేరడిగొండ: నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శేఖర్‌ను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. మంగళవారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. జాదవ్ పవన్, రాథోడ్ రాజశేఖర్, బాక్రే లక్ష్మణ్, రాథోడ్ పాండు, రాథోడ్ నకుల్, శ్రీను, పురుషోత్తం, ప్రసాద్, శంకర్, గోవింద్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రుచి వెంటే విషం!

- ఫాస్ట్‌ఫుడ్‌తో అనారోగ్య సమస్యలు
- పిల్లలపై తీవ్ర ప్రభావం
- హెచ్చరిస్తున్న వైద్యులు

ఇటీవల బోథ్ మండలంలోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో ఓ కుటుంబం న్యూడిల్స్‌తో పాటు మంచూరియా పార్సిల్ తీసుకెళ్లారు. ఇంటిల్లిపాది తిన్నారు. తెల్లారేసరికి కుటుంబసభ్యులందరికీ చేతులు, శరీర భాగాలపై దద్దుర్లు వచ్చాయి. దీంతో వారు ఆందోళనకు గురయ్యారు. వైద్యుల వద్దకు వెళ్లి జరిగింది చెప్పారు. వైద్యుడు చికిత్స చేసిన అనంతరం ఫాస్ట్‌ఫుడ్ తినొద్దని సలహా ఇచ్చారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఫాస్ట్‌ఫుడ్ వల్లే తమకు శరీరమంతా దద్దుర్లు వచ్చాయని కుటుంబ సభ్యులు గ్రహించారు. – బోథ్



మండలంలోని విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్‌పై ఆధారపడుతున్నారు. పట్టణం నుంచి గ్రామాల వరకు పిజ్జా, బర్గర్, ఫ్రైస్, షావర్మా, నూడుల్స్, చికెన్ రోల్స్, మంచూరియా, పకోడీ వంటి వంటలు విస్తృతంగా లభ్యమవుతున్నాయి. అయితే వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల అనారోగ్యం బారిన పడుతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ ఆహారంతో రుచితో పాటు విషాన్ని కూడా తింటున్నట్లు గ్రహించాలని నిపుణులు పేర్కొంటున్నారు.

అనేక రోగాలు..

తక్కువ ఖర్చుతో ఎక్కువ రుచి ఇచ్చేలా చేస్తూ వాణిజ్య దృక్పథంతో సిద్ధం చేసే ఫాస్ట్‌ఫుడ్స్‌లో అధికంగా నూనె, కృత్రిమ రంగులు, రసాయనాలు వాడుతున్నారు. పదే పదే వేయించిన నూనె వల్ల ట్రాన్స్ ఫ్యాట్స్ పెరిగి గుండె వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రంగులు, వాసనలు కలిపే కెమికల్స్ వల్ల లివర్, కిడ్నీ, హార్మోన్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. కొన్ని రసాయనాలు క్యాన్సర్‌కు దారితీయొచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఫాస్ట్‌ఫుడ్ తరుచూ తినడం శరీరానికి నెమ్మదిగా విషాన్ని చొప్పించడమేనని హెచ్చరిస్తున్నారు.

పిల్లలకు మరింత ప్రమాదం..

చిన్న వయసులోనే స్కూల్ పిల్లలు లంచ్‌బాక్స్ ఫుడ్ కంటే బర్గర్, నూడుల్స్ వైపు ఆకర్షితులవుతున్నారు. దీని వల్ల ఉబకాయం, మానసిక అసహనం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని పాఠశాలల వద్ద ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు ఉండటం వల్ల పిల్లలకు దీని మీద ఆసక్తి మరింత పెరిగింది. ఇక కళాశాలలలో చదివే విద్యార్థులు మధ్యాహ్నం ఫాస్ట్‌ఫుడ్‌కే ప్రాధాన్యమిస్తున్నారు.

పెద్దల బాధ్యత..

పిల్లల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత పెద్దలదే. ఇంట్లో సులభంగా తయారయ్యే ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలకు రుచి అనేది తప్పనిసరి కాకపోయినా శరీరానికి మేలు చేసే భోజనం తప్పనిసరి అని అర్థం చేయించాలి. ఫాస్ట్‌ఫుడ్‌పై పిల్లలకు వివరించాలి. ఉపాధ్యాయులు సైతం స్కూళ్లలో మంచి ఆహారంపై అవగాహన కలిగించాలి.

అనారోగ్య సమస్యలు..



ఫాస్ట్‌ఫుడ్ తింటే తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. రుచికోసం ప్రమాదకరమైన రంగులను కలుపుతున్నారు. దీనివల్ల కిడ్నీ, క్యాన్సర్లు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కృత్రిమ రంగులు ఇచ్చే రసాయనాలు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.

– కుమ్మరి కార్తీక్‌కుమార్, వైద్యులు, ఆదిలాబాద్

హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

తాంసి: మండలంలోని మత్తడి వాగు ప్రాజెక్టు వద్ద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలను మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు లేక సందర్శకులకు రక్షణ లేకపోవడంతో 'ప్రాజెక్టు వద్ద రక్షణ చర్యలు కరువు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వడ్డాడి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌజన్య, గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా ప్రమాదకరంగా ఉన్న పలు ప్రదేశాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 'ప్రమాదం జరిగే స్థలం అంటూ చేపలు పట్టడం, ఈతకు వెళ్లడం, నీటిలోకి రావడం వంటివి చేయవద్దు' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



ప్రాజెక్టు గేట్ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఘనంగా ఎల్లమ్మ తల్లి కల్యాణం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టిసావర్‌గాంలో గౌడ గీత కార్మిక సంఘం, దుబ్బగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గత ఐదురోజులుగా వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేడుకలకు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సతీసమేతంగా పాల్గొనగా, పదుల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, భూపతి గౌడ్, పరశురామ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దినేష్, అక్షయ్, నాగరాజ్ గౌడ్, దేవేందర్ గౌడ్, సాయి చైతన్య గౌడ్, నరేశ్‌గౌడ్, రమేశ్ గౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ తల్లి కల్యాణం చేస్తున్న భక్తులు

ఘనంగా బోనాల పండుగ

ఆదిలాబాద్: ఖత్రి సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఖత్రి సమాజ్ భవనం నుంచి శోభాయాత్రకు బయలుదేరి పట్టణంలోని మహాలక్ష్మీవాడలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. సమాజ్ అధ్యక్షుడు ఆదిత్య ఖండేశ్కర్, కార్యదర్శి బండేవార్ రాజ్ శ్రీనివాస్, ట్రెజరర్ బండేబర్ సతీశ్, గుజరాతి పవన్, ఉత్తమ్, కిషోర్, రాజ్‌కుమార్, నాగేశ్వర్, రామేశ్వర్, బాబురాజా, మహిళలు పాల్గొన్నారు.



బోనాలతో శోభాయాత్రగా వెళ్తున్న మహిళలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

నేరడిగొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ల్యాబ్ టెక్నీషియన్ విధులకు రాకపోవడంతో రక్త పరీక్షలు చేసేవారు లేక రోగులు ఆందోళన చేపట్టారు. ఆందోళన చేపట్టిన రోగులను రాథోడ్ సజన్, నేరడిగొండ మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డిలు సముదాయించారు. ల్యాబ్ టెక్నీషియన్ గైర్హాజరుకు గల కారణాలను డాక్టర్ సద్దాం ద్వారా అడిగి తెలుసుకున్నారు. వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, అంబేకర్ పండరి, సాబ్లే సంతోష్ సింగ్, రాథోడ్ రాజశేఖర్, జాదవ్ పవన్, బాక్రే లక్ష్మణ్, శ్రీను, ప్రసాద్, శంకర్, గోవింద్, సీతారాం, బాబు, బాక్రే ప్రేమ్‌సింగ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని రాథోడ్ సజన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. డిజిటల్ బోర్డు వినియోగం ,తాగునీటి సరఫరా పథకాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బోథ్ ఎస్సైకి సన్మానం

బోథ్: ఎస్సైగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న శ్రీసాయిని బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, సీపీఐ నాయకులు, జిల్లా సోషల్ మీడియా కాంగ్రెస్ కన్వీనర్ బత్తుల రమేశ్, భగత్ ప్రవీణ్‌లు ఎస్సైని వేర్వేరుగా ఘనంగా సన్మానించారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

బోథ్: బోథ్ పట్టణ వారసంతలో మంగళవారం ఎంపీడీవో రమేశ్, ఈవో అంజయ్య, ఎంపీవో అతుల్‌లు ప్లాస్టిక్ వాడకం వల్ల ఏర్పడే నష్టాలపై వ్యాపారస్తులకు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించారు. వారసంత ప్రాంతం ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు గ్రామపెద్దలు, మహిళలు, యువకులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ఎంపీవో అతుల్ కుమార్, ఈవో అంజయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ ఆత్మకమిటీ పాలకవర్గానికి సన్మానం

బోథ్: బోథ్ డివిజన్ ఆత్మ కమిటీని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. కాగా వారిని వ్యవసాయ విస్తరణ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. చైర్మన్ గొర్ల రాజు యాదవ్ మాట్లాడుతూ సబ్సిడీపై లభించే వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు తదితరాలను అర్హులైన రైతులకు పారదర్శకంగా పంపిణీ చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నీటి నిల్వ లేకుండా చర్యలు

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిన్నపాటి వర్షం కురిసినా మైదానం బురదమయంగా మారుతుంది. సమస్యను పాఠశాల ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించారు. సొంత నిధులతో మైదానాన్ని చదును చేయించి, ఎర్రమొరం పోయించి, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

కాంట్రాక్ట్ సస్పెన్షన్ నిలుపుదల

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ కాంట్రాక్ట్ సస్పెన్షన్‌ను నిలుపుదల చేస్తూ హైకోర్టు స్టే విధించిందని కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ దక్కించుకొని 36 నెలలుగా రిమ్స్‌లో సేవలు అందిస్తున్నామని, సామాజిక బాధ్యతగా రిమ్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం టెండర్లు పిలిచేంత వరకు ఒప్పందం చేసుకున్న కంపెనీ పనిచేయాల్సి ఉంటుందన్నారు.

నిజాయితీ చాటుకున్న డ్రైవర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ సమీర్ తన నిజాయితీ చాటుకున్నాడు. సాత్నాలకు చెందిన సంజీవయ్య ఫోన్ పడిపోగా సమీర్‌కు దొరికింది. దీంతో మంగళవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను అప్పగించాడు. వన్‌టౌన్ ఎస్సై అశోక్ బాధితుడిని పిలిపించి సెల్‌ఫోన్ అందజేశారు.

18లోగా రిపోర్టు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఐటీఐ కళాశాలలో అడ్మిషన్ పొందిన వారు ఈనెల 18లోగా రిపోర్టు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 9603612909పై సంప్రదించాలని సూచించారు.

ధర్మసమాజ్ పార్టీ నాయకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించిన ధర్మసమాజ్ పార్టీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై దివ్యభారతి తెలిపారు. మంగళవారం మాభూమి రథయాత్రలో భాగంగా కలెక్టరేట్ వద్ద మధ్యాహ్నం రోడ్డుపై బైఠాయించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. 30 యాక్ట్ అమలులో ఉన్నప్పటికీ పోలీసుల అనుమతి లేకుండా నిరసన చేపట్టారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్, ఇచ్చోడకు చెందిన లక్ష్మణ్, శ్రీవాస్, కజ్జర్లకు చెందిన అగ్గిమల్ల గంగన్న, జైనథ్ మండలంలోని కరంజికి చెందిన పొచ్చన్నలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని బోదిడికి చెందిన జయశీల తన ఇద్దరు పిల్లలతో సోమవారం ఇచ్చోడలోని ధాబా(కె) నుంచి తన అత్తారింటికి వెళ్లేందుకు ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. సాయంత్రం తన భర్తకు ఫోన్ చేసి రైలు మిస్ అయ్యిందని, తాను మహారాష్ట్రకు రావడం లేదని చెప్పింది. పుట్టింటికి, అత్తారింటికి చేరుకోకపోవడంతో ఆమె తమ్ముడు ప్రవీణ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.

వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

ఆదిలాబాద్‌టౌన్: 8వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని తెలంగాణ ఆల్‌పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్షుడు శశికాంత్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేశారు.

సిడాం శంభు విగ్రహం ఏర్పాటు చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ తొలితరం ఉద్యమ నాయకుడు సిడాం శంభు విగ్రహాన్ని మత్తడిగూడలో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తుడుందెబ్బ వ్యవస్థాపకుడు స్వర్గీయ సిడాం శంభు 7వ వర్ధంతిని జూలై 20న ఆదివాసీలు, అభిమానులు వచ్చి వర్ధంతిని విజయవంతం చేయాలని సిడాం శంబు వారసులు సోనేరావు, ఆదివాసీ జిల్లా నాయకులు సెడ్మకి సీతారాంలు కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో ఆశన్న ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని లక్కారం ఎంపీపీఎస్, ఎంపీపీఎస్ ఉర్దూ, ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ పాఠశాలలను సందర్శించారు. హెచ్ఎం సుభాష్, ద్రుపద, షేర్‌సింగ్‌లు ఉన్నారు.

వేతన వెతలు

- భారంగా కుటుంబ పోషణ
- అల్లాడుతున్న 'ఉపాధి' కాంట్రాక్ట్ ఉద్యోగులు

సాత్నాల: భోరజ్, సాత్నాల మండలాల పరిధిలోని ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. సాంకేతిక కారణాలు చూపుతూ ప్రభుత్వం వేతనాలు విడుదల చేయడం లేదు. ఉన్నతాధికారులను ఎన్నిసార్లు అడిగినా స్పందించకపోవడంతో ఉపాధిహామీ కాంట్రాక్టు ఉద్యోగులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

పని ఒత్తిడితో సతమతం..

వేతనాలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ విధుల్లో మాత్రం ఏమాత్రం అలసత్వం వహించొద్దంటూ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు విధిస్తున్న టార్గెట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ, ఏపీవోలను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లదే కీలకపాత్ర. గ్రామాల్లో పనులు చేయించడం ఫీల్డ్ అసిస్టెంట్ పని కాగా, క్షేత్ర స్థాయిలోకి వెళ్లి కొలతలు తీసుకొని, ఎంబీ రికార్డు చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత టీఏలపై ఉంటుంది. ఒక్కో టెక్నికల్ అసిస్టెంట్‌కు 6 నుంచి 7 గ్రామ పంచాయతీల విధులు ఉండడంతో తీవ్రంగా పని ఒత్తిడికి గురవుతున్నారు. కూలీలకు రూ. 300 వేతనం రావాలన్న అధికారుల ఆదేశాలతో కూలీలకు పూర్తి వేతనం అందిస్తున్నారు. అయితే సామాజిక తనిఖీ సమయంలో పని తక్కువ చేసినా రూ. 300 కూలీ అందించారని టెక్నికల్ అసిస్టెంట్‌లను బాధ్యులను చేస్తూ వారి నుంచి తిరిగి రికవరీ చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వన మహోత్సవం సందర్భంగా చెట్లు నాటించడం, పశుశాలలు, ఇంకుడు గుంతలు, కోళ్ల ఫారాల షెడ్డు నిర్మాణం వంటి విధులు టెక్నికల్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.



ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ సిబ్బంది (ఫైల్)

వెంటనే చెల్లించాలి



మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రూమ్ కిరాయిలు, నిత్యావసర ఖర్చులు, రోజువారీ విధులకు హాజరయ్యేందుకు పెట్రోల్ ఖర్చులు కూడా ఉండడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వేతనాలు వెంటనే చెల్లించాలి.

– రాకేశ్, టీఏ, ఆదిలాబాద్

బీజేపీ మండల అధ్యక్షుడిగా చంద్రకిరణ్



చంద్రకిరణ్

తాంసి: బీజేపీ మండల అధ్యక్షుడిగా కప్పర్ల గ్రామానికి చెందిన ఏలేటి చంద్రకిరణ్ మంగళవారం నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్ చంద్రకిరణ్‌కు నియామక పత్రం అందజేశారు. కాగా పార్టీ మండల ఇన్‌చార్జిగా సిరిగిరి మహేందర్‌ను నియమించారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా ఆకుల రాజశేఖర్



ఆకుల రాజశేఖర్

నేరడిగొండ: మండల బీ జేపీ కన్వీనర్‌గా ఆకుల రాజశేఖర్‌ను పార్టీ జిల్లా అ ధ్యక్షుడు పతంగే బ్రహ్మా నందం నియమించారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తలమడుగు అధ్యక్షుడిగా నక్క ధనంజయ్



నక్క ధనుంజయ్

తలమడుగు: బీజేపీ మండల అధ్యక్షుడిగా నక్క ధనుంజయ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని నక్క ధనుంజయ్ తెలిపారు.

'రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వానికి పట్టింపు లేదు'



వివరాలు సేకరిస్తున్న బొర్రన్న

బజార్‌హత్నూర్: పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ భరోసా లేకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, రైతు ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఆరోపించారు. మండలంలో గతంలో వర్తమన్నూర్ గ్రామానికి చెందిన రైతు మైలా నర్సయ్య, దేగామ గ్రామానికి చెందిన రైతు మేకల విఠల్ అప్పులబాధతో ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. రైతులు శ్రీకాంత్, పురుషోత్తం, కిసాన్ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్ షారుక్ పాల్గొన్నారు.

డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్ మెట్‌పెల్లివార్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్ పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెంగీ నివారణ కోసం యాక్షన్ ప్లాన్ తయారు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్, వైద్యారోగ్య శాఖ, మెప్మాతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటింటికి తిరుగుతూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఖాళీ కుండీలు, కొబ్బరిబోండాలు, టైర్లు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే చేపడుతున్నట్లు వివరించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, శాంతినగర్ మెడికల్ ఆఫీసర్ ఇఫత్, మలేరియా సూపర్‌వైజర్లు అనిల్, కేమ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీధర్, పక్కన మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

బజార్‌హత్నూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని డీఐఈవో జాదవ్ గణేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన బోధన అందిస్తూ అత్యుత్తమ ఫలితాలు రాబట్టలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఐఈవో జాదవ్ గణేశ్